క్లుప్తంగా

సామాజిక విలువలు పెంపొందించాలి


మాట్లాడుతున్న సీఐ ప్రేం కుమార్

కాగజ్‌నగర్ టౌన్: ఉపాధ్యాయులు నాణ్యమైన విద్య అందించడంతో పాటు సామాజిక విలువలు పెంపొందించాలని పట్టణ సీఐ ప్రేంకుమార్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (ఓల్డ్)లో నిర్వహిస్తున్న ఉపాధ్యాయ శిక్షణ తరగతుల శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్ ఉపాధ్యాయుల చేతుల్లో ఉంటుందని, విద్యార్థులకు క్రమశిక్షణతో పాటు విద్యను బోధించాలని సూచించారు. అనంతరం జిల్లా సైన్స్ అధికారి కటుకం మధూకర్ మాట్లాడుతూ శిక్షణలో పొందిన జ్ఞానాన్ని తరగతిలో గదిలో అమలు చేయాలన్నారు. కోర్సు డైరెక్టర్, ఎంఈవో వసాలా ప్రభాకర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచాలన్నారు. కార్యక్రమంలో మండల రిసోర్స్‌పర్సన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

‘ఉనికిని కాపాడుకునేందుకే ఆరోపణలు’

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలోని హెచ్‌ఎంఎస్ నాయకులు తమ ఉనికిని కాపాడుకునేందుకు గుర్తింపు సంఘం ఏఐటీయూసీపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఆర్గనైజింగ్ కార్యదర్శి జుపాక రాజేష్ అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని కేఎల్ మహేంద్రభవన్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏఐటీయూసీ కార్మిక సంక్షేమం కోసం, హక్కుల సాధన కోసం చేస్తున్న పనులను చూసి ఓర్వలేకే హెచ్‌ఎంఎస్ నాయకులు ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. సీహెచ్‌పీ పిట్ కార్యదర్శి ఎంబడి రామయ్య, కమిటీ సభ్యులు అబ్దుల్ షమీ, వేణుగోపాల్, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో ఎద్దు మృతి

నార్నూర్: మండలంలోని తాడిహత్నూర్ గ్రామానికి చెందిన జాదవ్ సబుబాయి ప్రకాష్ రైతు పొలంలో విద్యుత్ షాక్ శనివారం ఎద్దు మృతి చెందింది. గత రెండు రోజులుగా భారీ వర్షం కురుస్తుంది. శనివారం ఉదయం మేతకు వెళ్లిన ఎద్దు విద్యుత్ మోటర్ కోసం ఏర్పాటు చేసిన స్టార్టర్ వద్ద ఉన్న విద్యుత్ తీగలకు తగిలి మృతి చెందినట్లు తెలిపారు. ఎద్దు విలువ రూ. 50 వేలపైనే ఉంటుందని రైతు పేర్కొన్నాడు.

పశుపోషకులకు అండగా..

- ఉపాధి హామీలో షెడ్ల నిర్మాణం
- 23 షెడ్ల నిర్మాణం పూర్తి
- ఒక్కో షెడ్డుకు రూ.85 వేలు


ఉమ్రి గ్రామంలో నిర్మాణంలో ఉన్న పశువుల షెడ్డు

కెరమెరి: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకంలో భాగంగా పశువుల షెడ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గ్రామీణప్రాంతాల్లోని పాడి రైతులకు జాబ్‌కార్డు కలిగి ఉన్నవారు పశువుల షెడ్ల నిర్మాణం చేపట్టవచ్చు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 23 మంది రైతులు పశువుల షెడ్లు నిర్మించుకున్నారు. గరిష్టంగా పశువుల షెడ్డుకు రూ.85 నుంచి రూ.90 వేల వరకు మంజూరు చేస్తున్నారు. పశువులకు ఎండావానల నుంచి కాపాడుకునేందుకు పాడి రైతులకు ఇదో చక్కని అవకాశంగా ఉపయోగపడుతుంది.

బిల్లులు ఇలా..

ఉపాధి హామీ పథకంలో అధికారులు ఎప్పటికప్పుడు రైతులకు పశువుల షెడ్ల నిర్మాణం కోసం అవగాహన కల్పిస్తూనే ఉన్నారు. వాస్తవంగా ఐదు నెలల్లో 35 నిర్మించాల్సి ఉన్నప్పటికి 23 మంది రైతులు షెడ్ల నిర్మాణానికి ముందుకు వచ్చారు. దీని నిర్మాణంలో బేస్‌మెంట్, లెంటల్, రూఫ్ లెవల్ స్థాయిలు ఉంటాయి. వీటి ఆధారంగా రైతులకు బిల్లులు చెల్లిస్తారు. నిర్మాణం పూర్తయిన తర్వాత ఈజీఎస్ అధికారులతోపాటు పంచాయతీ కార్యదర్శి మొత్తం బిల్లులను లబ్ధిదారులకు అందిస్తారు. కాగా, ఉపాధి హామీ పథకంలో పనులు చేస్తే బిల్లులు సకాలంలో రావనే ఉద్దేశంతో అనేకమంది రైతులు పశువుల షెడ్లు నిర్మాణానికి ముందుకు రావడం లేదని తెలుస్తోంది. మండలంలో 90 శాతం మంది అన్నదాతలు ఉన్నారు. వారి వద్ద ఎడ్లు, ఆవులు, గేదేలు ఉన్నాయి. వారికి షెడ్లు అవసరమే.. కాని ఆర్థిక ఇబ్బందులు వల్ల కూడా అనేక మంది ముందుకు రావడం లేదు.

జాబ్ కార్డు, తెల్లరేషన్‌కార్డు ఉండాలి

గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు ఉపాధి జాబ్ కార్డుతోపాటు తెల్లరేషన్ కార్డులు కలిగి ఉండాలి. ఐదెకరాల కంటే తక్కువగా ఉన్న చిన్న, సన్నకారు రైతులు అర్హులు. ఆవులు, ఎద్దులు, గేదెలు మూడుకన్నా ఎక్కువగా ఉండాలి. కోళ్లు అయితే 50 కన్నా ఎక్కువగా ఉండాలి. పశువుల షెడ్డు అవసరమని గ్రామ పంచాయతీ నుంచి అనుమతి, పశువులు కలిగి ఉన్నట్లు పశువైద్యాధికారి నుంచి ధ్రువీకరణ పత్రం తీసుకోవాలి. తెల్లరేషన్ కార్డు, జాబ్‌కార్డు, పంచాయతీ అనుమతి పత్రం, పశువైద్యాధికారి ధ్రువీకరణ పత్రాలతో ఉపాధి హామీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి.

సద్వినియోగం చేయాలి



పాడి రైతులకు పశువుల షెడ్డు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న వారికి పశువుల షెడ్లు మంజూరు చేస్తాం. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. నిర్మాణ దశలను బట్టి బిల్లులు అందజేస్తాం.
– మల్లయ్య, ఏపీవో

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న సీఐ బుద్దె స్వామి

రెబ్బెన: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని రెబ్బెన సీఐ బుద్దె స్వామి అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన మండల స్థాయి ఎస్జీటీ ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో రెబ్బెన పోలీసుల ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, మానవుల అక్రమ రవాణాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అపరిచితులు ఫోన్‌చేసి వివరాలు, ఓటీపీలు అడిగితే చెప్పవద్దన్నారు. ఎట్టి పరిస్థితుల్లో లింక్‌లు ఓపెన్ చేయొద్దన్నారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు. ఎస్సై చంద్రశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కెరమెరి: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ఎస్.మధుకర్ పేర్కొన్నారు. మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంఈవో ఆడే ప్రకాశ్ ఆధ్వర్యంలో గడిచిన ఐదురోజులుగా ఉపాధ్యాయులకు కొనసాగిన శిక్షణ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పాఠశాలలకు దూరంగా మద్యం షాపులు ఉండాలన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. వారిని భావిపౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఎంఆర్‌పీలు ప్రత్యూష, కల్పన, శ్రీధర్, రవితేజ, వినీత్, నరేశ్, అరుణ్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

టీజేఎఫ్ రజతోత్సవం విజయవంతం చేయాలి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జర్నలిస్టులు

రెబ్బెన: హైదరాబాద్‌లోని నెక్లెస్‌రోడ్డులో గల జలవిహార్ ఆడిటోరియంలో ఈనెల 31న నిర్వహించే టీజేఎఫ్ రజతోత్సవాన్ని విజయవంతం చేయాలని టీయూడబ్ల్యూజే హెచ్–143 జిల్లా కన్వీనర్ రవి నాయక్ కోరారు. మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్ వద్ద శనివారం రజతోత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లా జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. జర్నలిస్టులు రామస్వామి, ఇప్ప పోచయ్య, దాసుబాబు, దర్మేందర్, సంతోష్, ప్రదీప్, సాయి సుప్రజ్, రమేశ్, సాయిబాబా, రాందాస్, హరీశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలి


మాట్లాడుతున్న జీఎం విజయ భాస్కర్‌రెడ్డి

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను సింగరేణి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించాలని జీఎం విజయ భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం గోలేటిలోని జీఎం కార్యాలయంలో ఏరియాలోని అన్ని విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆవిర్భావ వేడుకలను అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. వేడుకల కోసం భీమన్న స్టేడియంతోపాటు జనరల్ మేనేజర్ కార్యాలయాన్ని అందంగా ముస్తాబు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం రాజమల్లు, ఏరియా సెక్యూరిటీ అధికారి ఉమాకాంత్, డీజీఎంలు ఉజ్వల్‌కుమార్ బెహారా, కృష్ణమూర్తి, శ్రీనివాస్‌రావు, పర్సనల్ మేనేజర్ తిరుపతి, ఫైనాన్స్ మేనేజర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షం.. రైతులు అగమాగం


ధాన్యంపై కప్పిన టార్పాలిన్లు

దహెగాం: గత నాలుగు రోజుల నుంచి ప్రతీ రోజు అకాల వర్షాలు కురుస్తున్నాయి. కోసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టగా ధాన్యాన్ని కాపాడేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. శుక్రవారం రాత్రి సైతం భారీ వర్షం కురిసింది. దీంతో కేంద్రాల్లోని ధాన్యం తడిసిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తీవ్రంగా నష్టపోతున్నామని వాపోతున్నారు. ఎలాంటి షరతులు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తం

- డ్రెయినేజీలో పేరుకుపోయిన చెత్త
- రోడ్డుపై పారుతున్న మురుగునీరు
- పట్టించుకోని అధికారులు


బోరింగ్ వద్ద అధ్వానంగా పరిస్థితి


రోడ్డుపై పారుతున్న మురుగునీరు

వాంకిడి: మండలంలోని కనర్‌గాం పంచాయతీలో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. మురుగుకాల్వల్లో చెత్త పేరుకుపోయింది. దీంతో మురుగునీరు నీరు రోడ్డుపై చేరడంతో దుర్వాసనతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ పాఠశాల సమీపంలోని తాగునీటి బోరింగ్ వద్ద అపరిశుభ్రత నెలకొంది. నామమాత్రంగా నిర్మించిన ఇంకుడుగుంత చెత్తాచెదారంతో నిండింది. ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి నీరు ఇంకకుండా నిల్వ ఉండి దోమల వ్యాప్తికి ఆవాసంలా మారింది. ఉదయం, సాయంత్రం వేళల్లో గ్రామస్తులు నీళ్ల నింపుకొనే సమయంలో గుంత నిండి నీరు రోడ్డుపై పారుతోంది. తీవ్ర దుర్గంధం వస్తున్నా పంచాయతీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా పట్టించుకుని చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పట్టించుకోవడం లేదు



మురుగుకాల్వల్లో పూడిక నిండి ఉంది. దుర్వాసన వల్ల ఇబ్బందిగా ఉంది. పంచాయతీ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. మురుగుకాల్వలను పునర్నిర్మాణం చేపట్టి మురుగునీరు రోడ్డుపై రాకుండా చర్యలు తీసుకోవాలి.
– మోహర్లె భీంరావు, కనర్‌గాం

చర్యలు చేపట్టాలి



వర్షాకాలం దృష్టిలో పెట్టుకుని పారిశుద్ధ్యం లోపించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. మురుగుకాల్వల్లో పూడిక తొలగించాలి. ప్రభుత్వ పాఠశాల సమీపంలోని బోరింగ్ వద్ద ఇంకుడు గుంత నిండి నీళ్ల రోడ్డుపైకి రాకుండా చూడాలి.
– బెండారె పొచ్చు, కనర్‌గాం

సహాయకులే.. వంచకులు!

- అధికారుల అలసత్వం.. మహిళలకు శాపం
- స్త్రీనిధి రుణాల్లో వీవోఏ చేతివాటం
- జిల్లాలో తరచూ సంఘటనలు
- విచారణలో రూ. 12లక్షలు స్వాహా చేసినట్లు వెల్లడి


ఐకేపీ కార్యాలయంలో విచారణ చేస్తున్న అధికారులు


డబ్బులు చెల్లించినట్లుగా రశీదులు చూపిస్తున్న మహిళా సభ్యులు

కౌటాల: మహిళా సాధికారత కోసం ప్రారంభించిన స్వయం సహకార సంఘం రుణాలు పక్కదారి పడుతున్నాయి. మహిళల ఆర్థిక ప్రగతికి స్వయం సహాయక సంఘాల ద్వారా వివిధ బ్యాంకులు రూ. లక్షల్లో రుణాలు మంజూరు చేస్తున్నాయి. బ్యాంకులు, మహిళా స్వయం సహాయక సంఘాలకు సభ్యులకు వారధిగా ఉండే వివిధ విభాగాల సిబ్బంది కొందరి నిర్లక్ష్యాన్ని తను ఆసరాగా చేసుకొని చేతివాటం ప్రదర్శిస్తూ రూ. లక్షల్లో నిధులు స్వాహా చేస్తున్నారు. ఈ విషయమై జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వివాదాలు చోటు చేసుకుంటున్నా ఘటనలు వెలుగు చూస్తున్నాయి. రుణాలు స్వాహా చేస్తున్న వారిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోకపోవడంతో రుణాల స్వాహా కేసులు తరుచూ నమోదవుతున్నాయి. తాజాగా కౌటాలలో ఉన్నతాధికారుల విచారణలో స్త్రీనిధి రుణాలను వీవోఏ స్వాహా చేసినట్లు తెలింది.

కంచే చేను మేస్తే..!

కంచే చేను మేస్తే అన్న చందంగా అక్రమాలను అడ్డుకోవాల్సిన అధికారులే ఆశాఖలోని మహిళ సభ్యుల డబ్బులను కాజేస్తున్నారు. మహిళ సంఘాల కొందరు సభ్యులు కిస్తీలు చెల్లించి అవి బ్యాంక్‌లో జమ చేస్తున్నారో చేయడం లేదో సరి చూసుకోకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తుతోంది. మరికొన్ని సంఘాల్లో సభ్యులకు తెలియకుండా నిధులను విడుదల చేసుకొని సొంతానికి వాడుకుంటున్నారు. ప్రతీ నెలా సమావేశం నిర్వహించి ఖాతాలో డబ్బుల వివరాలను ఎప్పటికప్పుడు సరి చూసుకుంటే అవకతవకలకు చోటుండదని అధికారులు అంటున్నారు. జిల్లాలో 8,275 మహిళ సంఘాల్లో 92,512 మంది సభ్యులున్నారు. జిల్లాలోని ఆసిఫాబాద్, జైనూర్, కెరమెరి, లింగాపూర్ మండలాల్లోని మహిళా సంఘాలకు ఉపాధి యూనిట్ల రుణాలు మంజూరు చేసి సీసీలు రూ. వేలాల్లో వసూలు చేశారనే ఆరోపణాలున్నాయి. కాగజ్‌నగర్, కౌటాల మండలాల్లో స్త్రీనిధి రుణాల గోల్‌మాల్ సంఘటనలు చోటు చేసుకున్నాయి. తమ డబ్బులు వీవోఏలు కాజేస్తుండడంతో బ్యాంకుల్లో నుంచి రుణాలు తీసుకున్న స్వయం సహాయక సంఘాల సభ్యులు ఇంకా పూర్తిస్థాయిలో రుణాలు చెల్లించాల్సి ఉందని బ్యాంకు అధికారులు చెబుతుండడంతో ఆయా స్వయం సహాయక సంఘాల సభ్యులు ఆందోళన చెందుతున్నారు.

కౌటాలలో విచారణ..

కౌటాల మండల సమాఖ్యలో వీవోఏగా విధులు నిర్వహిస్తున్న కర్ణాకర్‌గౌడ్ మహిళా సంఘాల నుంచి రుణ బకాయిలను వసూలు చేసి బ్యాంకులో జమ చేయకుండా రూ. 12 లక్షలు స్వాహా చేసినట్లు శనివారం కౌటాల ఐకేపీ కార్యాలయంలో చేసిన జిల్లా అధికారుల విచారణలో వెలుగులోకి వచ్చింది. ఇటీవల ‘సాక్షి’ దినపత్రికలో ‘స్త్రీనిధి రుణాల స్వాహా..!’ అనే శీర్షిక పేరిట ఒక కథనం ప్రచురితం కాగా శనివారం జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఐకేపీ డీపీఎం అన్నాజీ, స్త్రీనిధి ఆర్‌ఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో అధికారులు కౌటాల ఐకేపీ కార్యాలయంలో క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. మహిళ సంఘాలు ప్రతీనెల స్త్రీనిధి అప్పు వాయిదాల వారీగా చెల్లించినట్లు పలువురు మహిళలు తమ రశీదులను ఉన్నతాధికారులకు చూపించారు. సదరు వీవోఏకు డబ్బులు చెల్లించామని, తమ డబ్బులు సొంత అవసరాలకు వాడుకున్నట్లు తెలిపారు. తమ డబ్బులు సొంత అవసరాలకు వాడుకున్న వీవోఏపై చర్యలు తీసుకోవడంతో పాటు తమ డబ్బులు తిరిగి రికవరీ చేయాలని మహిళలు పేర్కొన్నారు. దీంతో సమగ్ర విచారణ చేపట్టగా వీవోఏ కర్ణాకర్ గౌడ్ మహిళా సంఘాలు తనకు ఇచ్చిన డబ్బులను బ్యాంకులో చెల్లించకుండా పక్కదారి పట్టించినట్లు అధికారులు గుర్తించారు. ఈ విషయంపై సదరు వీవోఏను అధికారులు ప్రశ్నించగా ఎలాంటి స్పందన లేకపోవడంతో మండల సమాఖ్య వీవోలు కౌటాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఏపీవో ముక్తేశ్వర్ తెలిపారు. మహిళలకు అందించే రుణాల్లో వసూళ్ల గురించి బాధితులు నేరుగా ఫిర్యాదు చేయవచ్చని, విచారణ చేసి చర్యలు తీసుకుంటామని జిల్లా ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు.

అహల్యాబాయి సేవలు మరువలేనివి


మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

కాగజ్‌నగర్ టౌన్: రాజమాత అహల్యాబాయి హిందూమత కార్యకలాపాలు, ధార్మిక కార్యక్రమాలు నిర్వహించడంలో ఆమె చేసిన సేవలు మరువలేనివని బీజేపీ రాష్ట్ర ప్రతినిధి, మాజీ జెడ్పీ చైర్మన్ సుహాసిని రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పాల్వాయి రాజ్యలక్ష్మిలు అన్నారు. శనివారం అహల్యాబాయి హోల్కర్ 300 జయంతి ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్ ప్రాంతానికి చెందిన చొండి గ్రామంలో జన్మించిన ఆమె తన పరిపాలన కాలంలో హిందూ మత కార్యకలాపాలు, ధార్మిక కార్యక్రమాలు నిర్వహించారని గుర్తు చేశారు. అనంతరం పట్టణంలోని సర్‌సిల్క్ కాలనీలోని పలు వీధుల గుండా ర్యాలీ నిర్వహించి రాంమందిర్‌లో ప్రత్యేక పూజలు, దీపారాధన కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు శివకుమార్, అరిగెల నాగేశ్వర్‌రావు, కృష్ణకుమారి, సొల్లు లక్ష్మి, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బడిబాట


మాట్లాడుతున్న శాంతి కుమారి

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో నేటి నుంచి 31వ తేదీ వరకు యూటీఎఫ్ అధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్నామని సంఘం జిల్లా అధ్యక్షురాలు శాంతి కుమారి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులు బడిబాటను విజయవంతం చేయాలని కోరారు. బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల ప్రవేశాల సంఖ్య పెంచాలన్నారు. ఉపాధ్యాయులు రాహుల్, గుణాకర్, హిమబిందు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన విద్య అందించాలి


మాట్లాడుతున్న ఎంఈవో హన్మంతు

కౌటాల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్యను ఉపాధ్యాయులు అందించాలని మండల విద్యాధికారి గావుడే హన్మంతు అన్నారు. కౌటాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న ఐదు రోజుల శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరగతి గదుల్లో ప్రతీ విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించేందుకు శిక్షణ తరగతులు ఉపయోగపడుతాయన్నారు. శిక్షణ తరగుతుల్లో నేర్చుకున్న ప్రతీ అంశాన్ని విద్యార్థులకు మేలు జరిగే విధంగా కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయులు విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉండవద్దని, ప్రభుత్వ విద్య బలోపేతం కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిశీలకులు శ్రీనివాస్, ఆర్పీలు శివాజీ, సాయికిరణ్, తిరుపతి, రావుజీ, సునీల్, సంజయ్, ప్రదీప్ పాల్గొన్నారు.

పాలిసెట్‌లో ప్రతిభ


వర్షిత్

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాకేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థి వర్షిత్ పాలిసెట్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చి 5146 ర్యాంకు సాధించినట్లు ప్రిన్సిపాల్ మహేశ్వర్ శనివారం తెలిపారు. పదో తరగతి ఫలితాల్లో 564 మార్కులు వచ్చాయని పేర్కొన్నారు. పాలిసెట్ ఎంపీసీలో 83 మార్కులతో రాష్ట్రంలో 5146 సాధించాడు.

శ్రీమైకు 117 ర్యాంకు

జిల్లా కేంద్రంలోని కల్వకుంట శ్రీ మైకు పాలిసెట్ ఫలితాల్లో ఎంపీసీలో రాష్ట్రంలో 117వ ర్యాంకు సాధించారు. శ్రీమై హన్మకొండలో ఎస్‌పీఆర్ పాఠశాలలో చదువుకుంది.

బెల్ట్ క్లీనింగ్ కార్మికులకు వేతనాలు చెల్లించాలి

రెబ్బెన: గోలేటి సీహెచ్‌పీలో పనిచేస్తున్న బెల్ట్ క్లీనింగ్ కార్మికులకు వెంటనే వేతనాలు చెల్లించాలని తెలంగాణ బొగ్గు గనుల కాంట్రాక్టు కార్మికుల సంఘం బెల్లంపల్లి ఏరియా అధ్యక్షుడు అంబాల ఓదెలు డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతీనెల 7లోపు కార్మికులకు వేతనాలు చెల్లిస్తామని సర్క్యులర్ జారీచేసి నోటీసు బోర్డులపై అంటించిన యాజమాన్యం దాన్ని అమలు చేయడంలో విఫలమవుతుందన్నారు. గోలేటి సీహెచ్‌పీలో బెల్ట్ క్లీనింగ్ కార్మికులకు నెలాఖరు వచ్చిన వేతనాలు అందకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఈ విషయాన్ని కాంట్రాక్టర్‌ను సంప్రదిస్తే తక్కువ హాజర్లు ఉన్నాయనే కారణంతో జరిమానా విధించడంతోపాటు వేతనాలు చెల్లించడం ఆలస్యం అవుతుందని సమాదానం చెబుతున్నారన్నారు. కార్మికులకు వేతనాలు అందేలా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని, లేకపోతే జీఎం కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.